# మిల్లిగరిటె

శ్రీ పుప్రేవు సత్యనారాయణ

★

అవి నా చిన్నతనపు రోజులు, నాకు మాయింట్లో ఎవరన్నా ఇష్టంగానే వుండేదిగాని, మాబామ్మ మీద మట్టుకు చాలా కోపంగా వుండేది. మా బామ్మ మాత్రం నన్ను అభిమానంగానే చూస్తుండేది. అతి ప్రేమతో నన్ను దగ్గరకు తీసుకుని ముద్దులాడు తుండేది. అయినప్పటికీ నాకు మా బామ్మఅంటే కిట్టేదికాదు. ముఖ్యంగా మా బామ్మకీనాకూ భోజనం చేసేటప్పుడు నెయ్యి వడ్డన దగ్గర పేచీవస్తుండేది. ఇది ఒకరోజు కాదు, రెండురోజులు కాదు, ప్రతిరోజూ మూడు పూటలూ యీ విషయంలో మా బామ్మతో తగువు తప్పేదికాదు. మా యింట్లో మా తాతముత్తా తలనాటినుండీ వంశపారంపర్యంగా వస్తూ వుండిన ఆస్తిలో మిల్లిగరిటె ఒకటి. ఆ గరిటెతో ఎన్నిసార్లు నెయ్యి వడ్డించినా, నేసుకునేవాళ్లకి విసుగెత్తి, ఎంతసేపు చెయ్యిచాచి వుంచనుఅని సిగ్గుచెంది, 'చాలు'అనవలసినదేకాని, నిజానికి చెయ్యిమాత్రం తడి అయ్యేదికాదు. మా యింటిల్లిపాదికీ మా బామ్మ అంటే, భయం. ఆవిడ ఒక మారు ఆ గరిటెతో నేయి వడ్డించేసరికల్లా మావాళ్లంతా, చాలు, చాలు, అని అరుస్తూ చెయ్యి వెనక్కిలాగేసుకోవలసినదే. మాబామ్మ దగ్గిర అలాంటి కాయిదాకు అంతా అల వాటుపడే వున్నారు. కనుక వాళ్లకి బాధలేక పోయేది. కాని నాదగ్గరమాత్రం ఆ రోజుల్లో మాబామ్మ ఆటలు ఎంతమాత్రం సాగేవికావు. ఒకరి కొకరము ఎత్తుకుపైఎత్తు వేస్తుండేవాళ్ళమేకాని, ఆట ఎప్పటికీ కట్టుఅయేది కాదు. నేను మహా పెంకిడిప్ప కాయనని మాబామ్మ అంటూవుండేది. ఇలాంటి పెంకి ఘటం యిదివరకు మనవంశంలో ఎరగమ్రా అంటుం డేది. అదివిని నేను చాలా గొప్పవాణ్ణిగానే భావించు కుని సంతోషించేవాడిని.

కంచంలో అన్నం పెట్టగానే మాబామ్మవచ్చి అందరితోపాటు ఒకగరిటెడు నెయ్యివేసి నామొఘం వేపు చూసేది. చాలు అనమని ఆవిడ ఉద్దేశం. నేను మాత్రం కణాయించి, 'నెయ్యిఏమీ పడలేదు బామ్మ! మరి రెండు గరిట్లు నెయ్యి' అని నిర్మొఘమాటంగా అనేవాడిని. గరిటెతో మరి రెండుమార్లువేసినా ఏమీ పడనిమాట నిజం. అయినా, మాబామ్మ వెయ్యడాని కిష్టపడేది కాదు. నాకు కోపంవచ్చేది. నాపంతం చెల్లాలని నా పట్టుదల. ఇంటిల్లిపాదీ తన అదుపాజ్ఞల్లో మసులుకుంటూవుంటే, యీ కుర్రకుంక నన్ను ఎదిరించడమా, యిప్పుడేవీడు యింత విర్రవీగుతూ వుంటే పెద్దవాడయినాక వీడినిపట్ట పగ్గాలుంటాయా? మొక్కప్పుడు వంగనిది మానయి వంగుతుందా అందుచేత ఇప్పటినుంచీ వీడిని లొంగదీసుకురావాలి? అని మాబామ్మ పట్టుదల. నేను అలిగి, అన్నం తిన కుండా, చాచిన చేయి చాచినట్టేవుంచి, మరి రెండు గరిటెలు నేయివేస్తేనేగాని తిననని భీష్మించుకు కూర్చునేవాడిని. కొంతిసేపయేక మాబామ్మ విధిలేక నేతిగిన్నె తెచ్చి గరిటె గిన్నెలోపెట్టి వట్టిగరిటే ఒకమారు అన్నంమీద తిప్పేది. నేను కంచంలోని అన్నం అంతా కలుపుకుని నెయ్యి వెయ్యిమన్నా మాబామ్మ ఒక గరిటెనెయ్యే వేసేది. ఆ అన్నమే నాలుగు మార్లు కొంచెం కొంచెం కలుపుకుంటే నాలుగుసార్లు నెయ్యి వేసేది. ఈ సంగతి నేను కని పెట్టి ఒక్కొక్క పిడచకు, ఒక్కొక్కమారు నెయ్యి వెయ్యమనేవాడిని. నా గడుసుతనం కనిపెట్టి మాబామ్మ అడిగినప్పుడల్లా ఒక్కొక్కమారు వట్టి గరిటె ఓమారు తిప్పుతుండేది. రాత్రిపూట దీపపు కీనీడను, మిల్లిగరిటె బోర్లించే నాకంచంమీద తిప్పేది. నేను వెయ్యికళ్లతో కనిపెట్టేవాడిని. ఏం బామ్మా గరిటె బోర్లించివేస్తే నెయ్యి ఏమైనా పడు తుందీ? అని అడిగితే, వెంటనే ఆవిడ 'చీకట్లో కన పడలేదురా బాబూ, పోనీ మళ్ళీ వేసుకో' అంటూ మళ్ళీ వట్టిగరిటె ఒకమారు ఐంద్రజాలికుడు యక్షిణీ కర్రతిప్పేటట్టు తిప్పేది. ఒకరోజు కోపం పట్టజాలక మాబామ్మ చేతిలోనున్న నేతిగిన్నెను లాక్కొని,

అందులోనున్న నెయ్యిఅంతా అన్నంలో వంచేసుకుని గిన్నె దూరంగా విసిరివేసి, 'నీకు అంతేకావాలి' అని కోపంగా గర్జించేను. మాబామ్మ గోడమూలకు పోయి బిక్కమొఖం వేసుకు నిలిచి పోయింది. ఆవిడ తన పరాజయాన్ని సహించలేక చిన్నపిల్లలాగ ఏడవటం ప్రారంభించింది.

ఇదివరకల్లా మాబామ్మకూ నాకూ జరుగుతూ వుండిన ఘర్షణఅంతా చూస్తూవుండినా మా నాన్న ఎప్పుడూ జోక్యం కలుగజేసుకోలేదు. బామ్మా, మనమడూ చెలగాటంగదా అన్న భావంతో నిర్లక్ష్యంగా ఊరుకునేవాడు. కాని యీ పర్యాయం మాత్రం ఊరుకోలేదు. వెధవా, ఊరుకుంటూవున్న కొద్దీ అంతకంతకు పెంకితనం లావయిపోతూవుంది. అని తాను భోంచేస్తున్న చోటునుండి లేవకుండా, వంగుకుని, నన్ను గట్టిగా నాలుగు చరుపులు చరిచింది. దెబ్బలునాలుగూ తగిలిన తరువాత, మాబామ్మ నామీద అభిమానం చూపిస్తూ "పోనీద్దూ, వాడికేం తెలుసు, కుర్రనాగమ్మ, వాడిని అలా కొట్టుకుంటూరుట్రా, నీకు మరీ మతిపోతోంది.' అని మా నాన్నను కసిరింది. అది వినగానే, ఊరుకున్న మానాన్న మళ్లీ కోపం తెచ్చుకుని 'వెధవకి, యిప్పటినుంచీ యింత పంతగొట్టుతనమా ?' అంటూ నన్ను మరిరెండు తగలనిస్తుంటే, మా అమ్మ అడ్డువచ్చి, "చాల్లెండి, తల్లీ కొడుక్కీ యీ గుంటవెధవే అనువుగా దొరికేడు.' అంటూనన్ను కౌగలించికుని, అవతలికి తీసుకువెళ్ళి, నా చెయిగకడిగేసి, గదిలోకి తీసుకుపోయింది.

మాబామ్మమీద నాకు కోపంగా వుండడానికి యింకా చాలా కారణాలు వున్నాయి. మాబామ్మని ఎప్పుడు అప్పచ్చిలు చెయమన్నా కొయ్యిచెవుగోణీలు, జంతికలూ, 'కొయ్యిరొట్టిముక్కలూ యివి తప్ప మరేవీ చేసేదికాదు. మానాన్న హోటలునుండి అప్పుడప్పుడు దూద్ పేడాలు, జహంగీర్లూ, బనారస్ కాజాలూ తెచ్చి, మాబామ్మకి భయపడి, దొంగతనంగా మాకు యిస్తూవుంటే, మాబామ్మ యీసంగతి ఎలాగో పసికట్టి, మామీద మండిపడేది. మానాన్న యిలాంటివి యింటికి తేవడమన్నా, మేము కిలకిలలాడుతూ తినడమన్నా, మాబామ్మ ఎంతమాత్రమూ చూచి ఓర్చలేక పోయేది. ఎప్పుడైనా పరిహాసానికి 'బామ్మా, దూధ్ పేడాలుచెయ్యి బామ్మా' అని మేము అంటే, 'అవేమిటో మాఅబ్బనాడూ తాతనాడూ ఎరగమురా బాబూ! అవి నేనేం చేసిపెడతాను.' అని కోపం దిగమ్రింగుకుంటూ వ్యంగ్యంగా జవాబు చెప్పేది. ఒక నిమిషం ఊరుకుని, 'వెధవలుకి దూధ్ పేడాలూ, గేదిపేడాలూ కావాలి! - పెద్దవెధవలకి బుద్ధిలేకపోతేసరి! తెచ్చిన నాలుగుడబ్బులూ యిలాగ తగలబెట్టేస్తుడం మే తెలుసు యీ కాలపువాళ్ళకి. ముందుచూపులేదు, వెనుకచూపులేదు - గేది పడ్డలు గడ్డితిన్నట్టు ఎంతసేపూ తిండి మాలోకమే. ఇలాగైతే మారోజుల్లో గంపెడు పిల్లలతోటి యింత లేసి సంసారాలు లిలా యీడుచుకురాగలిగే వాళ్లమేనా? ఆయన తెచ్చే నెలకు పదిరూపాయలు జీతంతోటి యింత సంసారం, యింటిగుట్టు బయటపడకుండా, ఎదుటివాళ్ళకి చెయ్యిచాచకుండా, కలోగంజో తాగుతూఉన్నంతలో ఉన్నంత కాలక్షేపం చేస్తూనే, పిల్లలకి పెళ్ళిళ్ళూ పేరంటాలూ చేయించేం, పిల్లలకి చదువులూ సంధ్యలూ చెప్పించేం. ఈకాలపువాళ్ళకి పొదుపులేదు, చదుపులేదు. చెప్పేవాళ్లు చెడ్డవాళ్లు. పోనీలెండి నాకేం పోయింది. కాటికి కాళ్ళు చాచుకొని కూర్చున్నదాన్ని, వింటే బాగుపడతారు, వినకపోతే పోతారు! ఎవరి కర్మకి ఎవరు కర్తలు!" అని ఒక లెక్చరుకొట్టేది. మాకు వొళ్ళు మండుకొస్తుండేది. ఆవిడ ధోరణి. తాను చెయ్యకపోతే పీడాపోయె, మేము తిన్నా చూచి సహించలేదుగదా అని నాకు చాలా కోపంగా వుండేది.

ఎప్పుడో ఎట్టకాలాని కొకమారు మా బామ్మ పిండివంటలకు తయారుపడినా అవే జంతికలు, చెవుగోణీలు, చక్కిలాలు! ఎవడికి కావాలి, రుచా, పచా! పళ్ళునొప్పి దండుగకాని! మమ్మలిని అతి ఆప్యాయంగా పిలిచి కూర్చోబెట్టి, ఆకువేసి, చెవుగోణీలు తినమని మా బామ్మ బ్రతిమాలేది. నేను ఒక్కముక్క కొరికి, 'ఏం బాగులేవు బామ్మా!' అంటూ లేచి గెంతుకుంటూ వెళ్ళిపోతూవుంటే, "రాజుని చూచిన కళ్ళకి, మొగుణ్ణిచూస్తే మొత్తబుద్ధి" అన్నట్టు, అడ్డమైన గడ్డీ హోటేళ్ళలో తినమరిగిన గుంటలుకి, యీ ముసలిముండ చేసినవి ఏమి నచ్చుతాయి నా బాబూ!' అని వ్యంగ్యంగా దీర్ఘంగా అనేది.

చేసిన చెవుగోణీలు ఖర్చవలేదన్న బెంగ మా బామ్మకి ఎప్పుడూ ఉండేదికాదు. ఈపండుగకు చేసిన పిండివంట మళ్లీ ఏదైనా పండుగవచ్చేవరకూ నిలవ ఉండాలి. ఈ మధ్యలో, ఎప్పుడైనా, చుట్టమూ పక్కమూ వస్తే వాళ్ళని గౌరవించడానికి 'రెడీ మేడ్' పలహారము వుండాలని మా బామ్మ ఉద్దేశము. కనుక జాగ్రత్తగా బుట్టలో పెట్టి మూతపెట్టి దాచేది. దీనంతకూ నాకు కోపంలేదు. ఎప్పుడైనా నాకు బాగా ఆకలివేసినప్పుడు, 'బామ్మా, రెండు చెవుగోణీలు యివ్వవూ?' అని అడిగితే 'నాయినా అవి

పైనిలేవు మడిలో వున్నాయి. ఆనక స్నానంచేసి మడి గట్టుకున్నాక తీసి యిస్తానులే' అనేది. అటువంటి అవకతవక పదార్థం, పాడయిపోకుండా, మేము ఖర్చుపెడతా మనడమే మహాభాగ్యంగా తలుస్తూ వెంటనే యివ్వమనగానే యివ్వడానికి బదులు నిర్లక్ష్యంగా జవాబు చెప్పేది. అందుచేత మా బామ్మ మీద నాకు కోపంగా వుండేది.

అంతే కాదు, నాకు మా బామ్మమీద ఆ రోజుల్లో, కోపంగా వుండడానికి మరో కారణం కూడా వుంది. మా బామ్మ నామీద ఎంతో ప్రేమగా వున్నట్టు పైకి నటిస్తున్నట్టుగా నాకు కనిపించేది. నేను అందమైన శుభ్రమైన గుడ్డముక్క కట్టుకుంటే చూసి సహించలేకపోయేది. అలాగని ఊరుకొనేదీ కాదు. నా పుట్టినదినం వారం రోజులుకి వస్తుందన్న దగ్గిర నుండీ నాకు కొత్త గుడ్డముక్క కుట్టించమని మా నాన్నకి తనే, రోజూ జ్ఞాపకం చేస్తుండేది.

మా నాన్న బజారునుండి మంచిమంచి సిల్కు గుడ్డలు రంగు రంగులవి, తళతళ మెరిసిపోతూవున్నవి మచ్చు చూపించడముకు యింటికి తెచ్చేవారు. నేను అవి చూసి మురిసిపోయి, ముచ్చటపడి, ఒక్కొక్క రకానికి ఒక్కొక్క చొక్కా కుట్టించాలి గదా అని పట్టుపట్టేవాడిని. అయితే ఏమి లాభం? ఆ ముసలిదానిమాట జవదాటడం మా నాన్నకి శక్యం కాదు. మాబామ్మ వచ్చి, 'ఇవి ఎలాగరా అబ్బాయీ ఖరీదు?' అని ప్రశ్నించేది. మానాన్న కొంత ధర తగ్గించి యిది గజం రూపాయి, రూపాయిన్నరా, యిలా గుంటాయి. ఖరీదుమాట కేమిలే, గుడ్డలు బాగున్నాయా లేవా అది చెబుదూ.' అని అడగగానే మా బామ్మ, 'బాగుండడాని కెక్కడికి నాయినా? పిండికొద్దీ రొట్టె. మన తాహతెంతో తెలుసుకుని నడుచుకోవాలి కాని, తలకుమించిన పరుగులు పరిగెత్తి బోర్లాపడడము ఏంలాభం? ఏదో, పుట్టినదినం కనక కొత్త గుడ్డముక్క కొనమన్నాను. ఓ, రూపాయి డబ్బుల్లో యిమిడేలాగ ఒక లాగూ లాల్చీ కుట్టించు గాని, యీ గుడ్డలన్నీ మోసుకొచ్చె వెందుకు?' అని చల్లగా చెప్పేది. మా నాన్న ఎప్పుడైనా సరదా కొద్దీ నాకు పంట్లాము కుట్టించితెస్తే మా బామ్మ సహించలేక, 'పాదాలమీద పడుతూ, బురదలో యీడుచుకుపోతూ యింతపొడుగు షరాయి ఎందుకు? ఆ వెనక తోకలేమిటి? చిన్న లాగు కుట్టిస్తే చాలదూ? బురదలో డేకిరీ గుంటలకి తెల్లటి గుడ్డలు ఎందుకు? ఏదో కాస్త గట్టిదీ, మాపోర్చేదీ, చెక్కు గుడ్డ కుట్టించకూడదూ? అంటూ అడ్డుతగిలేది. నాకు మా బామ్మమీద వళ్ళు మండుకొచ్చేది.

ఇంకా చిల్లర కారణాలు ఎన్నో ఉండేవి మా బామ్మమీద నాకు కోపంగా ఉండడానికి. మా నాన్న ఎప్పుడైనా మమ్మల నందరినీ సరదాగా సినీమాకు ప్రయాణంచేస్తుంటే, మా బామ్మ అడ్డుతగిలేది. గడియ గడియకూ సినీమాలూ, నాటకాలూ అంటూ డబ్బు తగలబెట్టడం నేర్చుకున్నారు. కానీ డబ్బు చేతులో వుంటే తేలు కుట్టినట్టు అనిపిస్తుందికబోసు. అంతకంతకు వెర్రులూ వికారాలూ ఎక్కువైపోతున్నాయి మీకు. అని సాధింపు ప్రారంభించేది. మా ప్రోగ్రామంతా కేన్సిలు అయిపోయేది. మరో కారణం ఏమిటంటే, ఉదయాన్నే మాఅమ్మ కాఫీచేసి మానాన్నకు యిచ్చి, నాకుకూడా యివ్వబోగా మాబామ్మ ప్రత్యక్షమై, "వాడికికూడా తక్కువొచ్చిందా ఏమిటి యీ మహాసౌభాగ్యం? ఈనీళ్లు తాగితే యిక వాడు చద్దిఅన్నం ఏమితింటాడు?" అని మా అమ్మని గసిరి, నాకు కాఫీ యివ్వకుండా చేసేది. ఈ కారణములన్నిటిచేతా, ఆకాలంలో మాబామ్మ నాకు ఒక శనిగ్రహంలాగ అనిపించేది.

## 2

నేను క్రొత్తగా గృహస్థాశ్రమంలో ప్రవేశించిన దినములవి. నాకు మా బామ్మమీద కోపం ఎక్కువగుటకు గల క్రొత్త పరిస్థితు లేర్పడినవి. క్రొత్తగా కాపరానికి వచ్చినపిల్ల. ఇంట్లో పనిపాట్లు చేయగలిగిన పెద్దవాళ్లువుండగా చిన్నపిల్లచేత ఎందుకు పనులుచేయించి శ్రమ పెట్టాలి? మా అమ్మకుమాత్రం కోడలుమీద అభిమానమే. కోడలుని ఏపనీ చెయ్యనిచ్చేది కాదు. మా బామ్మమాత్రం యిందుకు వ్యతిరేకం. ఈపిల్ల వట్టి నేవక్క నిమిషం కూర్చోవడంఅంటే ఆవిడకు యిష్టంలేదు. సరదాగా పుస్తకం పట్టుకు కూర్చుంటే మా బామ్మకు వళ్ళు మంటగావుండేది. పుట్టె మునిగిపోయినట్లు తెల్లవారుఝామున నాలుగు గంటలకే తాను లేచి కూర్చోవడమే కాకుండా, యింటిల్లిపాదినీ లేపేస్తేనేగాని ఊరుకునేదిగాదు. రాత్రి పన్నెండుగంటల యీ వరకు ఏవో చక్కబెట్లే. పోనీ ఆవిడ ఖర్మం ఏదో ఆవిడ చూసుకుంటే బాగానే వుండును. తన వెనకాల తక్కినవాళ్లు కూడా తనతోపాటు తిరుగుతూ ఉండాలి. ఆడవాళ్ల భోజనా లవగానే, 'ఏమమ్మా, యీ పనులు మేము చూసుకుంటాములే, నీవు వెళ్ళి పడుకో.' అన్న ముక్క ఎప్పుడూ మా బామ్మ నోటంట వచ్చిన పాపాన్ని పోయేదిగాదు. ఆవిడమీద నాకు పట్టరాని కోపం వచ్చేది. కాని, యీ విషయం ఆవిడతో ఏమని చెప్పను? నాకు అప్పటికి కొంచం మర్యాదా, పెద్ద

మనిషి తనమూ, అలవాటయినవి. వాటితో భయం, సంకోచం, సిగ్గు అభివృద్ధి అయినాయి. గట్టిగా చిన్నప్పటిలాగు ఏమీ అనలేక పోయేవాడిని. మా బామ్మ చర్యలు చూస్తే అరికాలుమంట నెత్తికొస్తుండేది. కుటుంబంలో యిటువంటి ముసలివాళ్లు వుండడం అన్నివిధాలా బాధే అనిపించేది. అయితే మాత్రం ఏంచెయ్యగలను? ఈ బాధనుంచి తప్పించుకొనుటకు ఉపాయం ఆలోచించేను. ఇంతవరకూ నిష్పూచీగా, వేళకు యింత తిని హాయిగా తిరగడం నాకు చాలా బాగానే వుండినా, అదొక స్వేచ్ఛగా తోచలేదు. మే మిద్దరమూ దగ్గరగా నిలబడి మాట్లాడు కుంటుంటే చూసి బామ్మ సంహిం చేదికాదు. 'ఈ కాలపువాళ్లకి బొత్తిగా సిగ్గూ, లజ్జా లేదు; పిన్నా పెద్ద అన్న సంకోచం లేదు. విరగబడి పళ్ళికిలించడం నేర్చుకున్నారు యీ కాలపు ఆడకుంటలు. మా కాలంలో యిలాటి విడ్డూరా లెరగమమ్మా' అంటూ వుండేది. నేను దీర్ఘంగా ఆలోచించాను. ఈ యింట్లో వుండి మనం వీళ్లని ఏమన్నా లాభం లేదు. కనుక ఏదైనా ఉద్యోగం సంపాదించుకుంటే పట్నవాసంలో మా ఖర్మాన్ని మేము స్వేచ్ఛగా జీవించవచ్చును. అని ఆలోచన సాగించేను.

అతి ప్రయత్నంమీద పట్నంలో ఉద్యోగం దొరికింది. మాకు సంరక్షణకుగాను మా నాన్న మా బామ్మని నాతో పంపుతానన్నారు. స్వర్గానికి వెళ్లినా సవతిపోరు తప్పదన్నట్టు మా ఖర్మాన్ని మేము సుఖంగా వుండకుండా మా వెనకాల మళ్ళీ యీవిడ కూడా ఎందుకు ? అంత్య నిష్ఠురంకంటె ఆది నిష్ఠురమే మంచిదనుకుని, బామ్మని మాతో పంపవద్దు అని నిర్మొహమాటంగా, కచ్చితంగా చెప్పివేసేను.

పట్నంలో యాభైరూపాయలు జీతంతో స్వేచ్ఛగా వుండవచ్చును. బీచికి షికారు వెళ్ళవచ్చును. సినిమాకి వెళ్లవచ్చును. అన్నివిధాలా సుఖంగా వుండవచ్చును అని ఉవ్విళ్లూరేను. కాని మొదట్లోనే కథ ఎదురుతిరిగింది.

'ఇల్లు ఇరకటం ఆలు మరకటం' అన్నట్టు మొదటిదిమాత్రం వెంటనే అమల్లోకి వచ్చినది. పదిహేను రోజులు కాలు కాలిన పిల్లిలాగ వూరంతా తిరగ్గా తిరగ్గా అతి కష్టంమీద, ఒక చిన్నకొట్టూ, బొమ్మరిల్లంత పంచాది, గల భాగం పదిహేను రూపాయలకు అద్దెకు దొరికింది. ఆ కొట్లోనే బొగ్గులు బస్తా, ఆ కొట్లోనే పిడకలబుట్ట, అందులోనే పట్టీ పట్టకుండా మంచం, పరుపూ. నేను సాయంకాలం ఏదైనా మీటింగుకు పోదలచి బయలుదేరితే మా ఆవిడ "వేగం రండేం, చీకటి పడితేనా ఒక్కర్తెకూ భయం'' అని హెచ్చరించేది. ఒకరోజు టౌన్ హాలులో గొప్ప ఉపన్యాసం. సాయంకాలం 6 గంటలకు ప్రారంభమయినది. పది నిముషములు వినిపోదామని కూర్చుంటిని. ఉపన్యాసం చాలా ఆకర్షణీయంగా నుండుటచే అక్కడినుండి కదల బుద్ధిపుట్టలేదు. పక్కా ఒకగంట కూర్చుంటిని. ఉపన్యాసం సాగుతూనే వుంది. ఇంతలో, ఇంటివద్ద మా ఆవిడ యిచ్చిన వార్నింగు జ్ఞాపకం వచ్చింది. విధిలేక యింటిముఖం పట్టేను.

ఒకరోజు నేను యింటికి వచ్చేసరికల్లా మా ఆవిడ యింట్లోకి రాదు. కాని ఇంట్లోనే కూర్చుని వుండెను. పట్నవాసపు ఆచారానికి అది తప్పులేదని ఆ యింటివాళ్లు మాకు నచ్చచెప్పేరు. నాకు వంట రాదాయె. పల్లెటూరు కనకనా, యిరుగమ్మనో పొరుగమ్మనో బ్రతిమాలి పిడికెడు బియ్యం అత్తెసరు పడేసి పెట్టమని బ్రతిమాలడానికి. పట్నవాసంలో 'ఎవరికి వారే యమునాతీరే' సాయింత్రం ఆరుగంటలకి చచ్చీ చెడీ యింటికి చేరుకునేసరికల్లా యీ గండం ! నేను ఏపనైనా చేయగలనుగాని వంటమాత్రం బొత్తిగా రాదు. ఈ మూడురోజులు గండం ఎలాగ గడుస్తుందిరా దేవుడా అని బెంగపట్టుకుంది. ఆపూటకు మద్యాన్నం తాలూకు అడుగూ మడుగూతో కాలక్షేపం చేసేము. తక్కిన రెండురోజులూ విధిలేక హోటలునుండి కేరియరుతో అన్నం తెప్పించేను. కేరియరు మీల్సు మా ఆవిడకు ఎంతమాత్రం యిష్టం లేదు. తినినవెంటనే వాంతి చేసుకొనేది. హోటలుకు 5 రూపాయలు ఖర్చవడమూ తిండి సహించక పోవడం జరిగింది. నవ్వుతూ మా ఆవిడ అంది—'మీ బామ్మను తీసుకురాకూడదూ'. ఆ సలహా మొదట్లో బాగున్నట్టే కనిపించింది కాని, ఒకరోజు భాగవతానికి మీసాలు గొరిగించుకున్నట్టు, యీ మూడురోజుల యిబ్బంది కోసమూ ఆవిడను తీసుకువస్తే, తక్కినరోజులు ఆవిడ వల్ల మనకి అనేకవిధాలు యిబ్బందిగా వుంటుంది అన్నాను. "గడుసువాళ్లు పాపం'' అయితే ఆవిడ ఏ తత్ శుభముహూర్తమునకువచ్చి మీ గండం గట్టెక్కించి వెళ్ళిపోతూ వుండాలి కబోసు." అంది.

మేముఉన్న ఇంటికి ఎదురుగాఉన్న ఒక పెద్ద ఆఫీసరుగారి భార్యతో మా ఆవిడకు పరిచయం కలిగింది. దాని ఫలితంగా, ఆవిడకట్టుకున్న చీరవంటి చీర, ఆవిడ రాసుకునే హెయిరాయిలు, వాడుకునే సబ్బు, మాఆవిడకుకూడా కొనమని రిక్వెష్టు-డిమాండు

చేస్తుండేది. మనలో మనమాట. ఆవిడంటే పెద్ద ఆఫీసరుగారి భార్యా, ఆమెకు కావలసినవి కొనిపెట్టుటకు ఆమెభర్త సమర్థుడు. పులినిచూచి నక్క వాతపెట్టుకున్నట్టు మా ఆవిడకూడా ఆవిడని యిమిటేట్ చెయ్యాలంటే ఎలా కుదుర్తుంది! అయితే నేను నా అసమర్థతను ఆవిడదగ్గిర ఎలా వెల్లడి చేయగలను. డిగ్నిటీకి లోపం కాదూ! ఏమైనా అంటే చిన్నబుచ్చుకుంటుందని భయం. కనుక అటుంచి నరుక్కు రమ్మన్నట్టు, తెచ్చిన డబ్బుతో ముందు ఆవిడకు కావలసిన వస్తువులు కొనిపెట్టక తప్పేదికాదు. క్రొత్త సినీమా వస్తే వెళ్ళక తప్పేది కాదు. ఐదురూపాయలు కట్టిలు వేయిస్తే మళ్ళీ ఐదురోజులకే డిమాండు! ఈవాళ నెయ్యి పోయించుకుంటే మళ్ళీ ఎల్లుండికే 'నెయ్యి బొత్తిగా అయిపోయిందండీ' పాలు, పెరుగు, కాఫీగింజలు, పంచదార-ఇద్దరు మనుష్యులుగల కుటుంబానికే యింత యిబ్బంది అవుతూవుంటే పదిమంది పిల్లాపాపా ఉన్నవాళ్లు ఎట్లు కాలక్షేపం చేస్తున్నారు చెప్మా! అని నాకు ఆర్చర్యం కనిగేది. కోమటి కొట్టుమీద హిసాబు-క్రమంగా పాపం పెరిగినట్టు పెరిగింది. మరి అరువు ఇవ్వనన్నాడు షాహుకారు.

పట్నవాసం అగుటచేత కోర్టుపనిమీద, తెల్లవార్తే ఎవరో ఒకరు మా యింటికి వస్తుండేవారు. మా యిద్దరికీ ఉడకబెట్టుటకే మాఆవిడ ఏడుచెరువుల నీళ్లు త్రాగుతుంది. దానికితోడు చుట్టాలకూ పక్కాలకూ కూడా ఎక్కడ వార్చి వడ్డించగలదు? కాని, ఏమిటి చేయటము! వచ్చినవాళ్ళంతా మాకు కావలసిన వాళ్లు, పెద్దవాళ్లు. మా మీద అభిమానం వుండబట్టి కదా వస్తున్నారు. వాళ్ళని రావద్దనగలమా? వద్దంటే వాళ్లు మానరు కూడాను.

ఒక సంవత్సరము గడిచింది. నాకు, వేరింటి కాపురంలోనున్న కష్ట సుఖాలన్నీ అనుభవంలోకి వచ్చేయి. చిల్లర చిల్లరలన్నీ కలిపి రెండువందలు అప్పుపెరిగింది. ఈ పరిస్థితులు మా ఆవిడకు ఏమి తెలుసు పాపం! పరిస్థితులు యిలాగే వుంటే ఒక్క దినమైనా కాలక్షేపం జరగడం అసాధ్యంఅని తెలుసుకున్నా. బడ్జట్ సరిపుచ్చడం ఎంత ప్రయత్నించినా అసాధ్యం అయిపోయింది. ఏ ఖర్చు తగ్గింపడమా అని ఆలోచనలోకి దిగేను. అనవసరమైన ఖర్చు నాకేదీ కనిపించలేదు. కాఫీ మానేద్దామా? - అమ్మయ్యో.! అన్నమైనా మానగలంగాని, కాఫీనీళ్లు పడందే ప్రొద్దుట మంచంమీదినుంచి లేవనైనా లేవలేము. సినీమాలు మానివేస్తే? నెలకు పదిరూపాయలు మిగల్చవచ్చు. హెయిరాయిల్సు, స్నోలు మానేస్తే అయిదు రూపాయలు మిగులుతాయి. కాని, ఆ ఖర్చులజోలికి అసలే పోడానికి వీల్లేదు. కొన్నాళ్ళవరకైనా మా ఆవిడకు ఆపాటి వినోద విలాసాలు, సమకూర్చకపోతే ఆమెకు నాయందుగల గొప్ప ఆదరభావం సన్నగిల్లిపోతుందేమో, నా అసమర్థత ఆమెకు తెలిసిపోతుందేమో! అని లోపల భయం. మరి తక్కిన ఖర్చులన్నీ అసలే ముఖ్యం.

నాడు-నా చిన్నతనంలో-నెయ్యి ఎక్కువగా వేయనందుకు మా బామ్మమీద కోపగించేవాడిని. నేడు నెయ్యి ఎక్కువగా దిమ్మరించేస్తున్నదని మా ఆవిడమీద కోపం తెచ్చుకుంటున్నాను. తనవరకూ వస్తేగాని తెలియదుగదా! మా ఆవిడతో ఏదైనా మెల్లగాచెబితే పరిహాసం క్రింద కొట్టిపారేస్తుంది. గట్టిగా చెబితే మొఘం యిట్టేపెట్టుకుని మొదటికే మోసం తెస్తుంది. అయితే అతివృష్టి-లేకపోతే అనావృష్టి. ఇట్టి పరిస్థితుల్లో మా బామ్మగాని వుంటే కొద్ది రోజుల్లో యీ చిక్కులన్నీ తొలగిపోయి వ్యవహారం చక్కబడుతుందని నాకు గట్టిగా నమ్మకం తోచింది. అయితే మొదట మా బామ్మని రావద్దన్న పెద్దమనిషిని నేనేకదా, యిప్పుడు మళ్ళీ ఏ మొఘము పెట్టుకుని ఆవిడను రమ్మని పిలవగలను? పిలిస్తేమాత్రం ఆవిడ వస్తుందా? దీర్ఘంగా ఆలోచించేను. పది రోజులు సెలవు పెట్టి మా గ్రామం వచ్చేసేం. నా ప్లానంతా నా భార్యకు రహస్యంగా బోధపరిచేను.

## 3

"ఏమమ్మా,విశాఖపట్నం కాపరం ఎలాగుంది?"

"ఏం జెప్పమన్నారు బామ్మగారూ, ఎలాగుండాలో అలా గుందనుకోండి నిజంగా."

"ఏమమ్మా, అలా గంటున్నావు? నీ మొగుడు పెద్ద ఉద్యోగస్థుడాయెను. నీకేమిటి లోటు?

"బామ్మగారూ, ఎన్నుంటేమట్టుకు ఏమి లాభం? కొత్తకాపురం, కొత్తచోటు, నేను కుర్రదాన్ని, వేరు దక్షతలేదు. మీలాంటి పెద్దవాళ్ల చాటుని మసులుకోవలసిన దాన్నిగాని, ఒక్కర్తెనీ ఏమిచేసుకోగలను చెప్పండి?"

"అమ్మా, నువ్వింకా సత్తికాలపు మాటలే ఆడుతున్నావు. ఈకాలపు కోడళ్ళకి స్వతంత్రం కావాలి. అత్తగారి అదుపులూ, మామగారి పొదుపులూ వాళ్ళకి పనికొస్తాయీ? మాలాంటి ముసలిముండలమి చావు రాక యిలా ఏడుస్తున్నాముకాని, మేము బ్రతికివున్న లాభమేమిటమ్మా. మమ్మలిని చూసేవాళ్లెవరు?"

"బామ్మగారూ, నీ మనమడు చాలా విచిత్రమైన మనిషండీ. వారి తత్వం తెలుసుకోవడం ఎంతటివారికీ అసాధ్యం. ఎవరిమీదనైతే చిర్రు బుస్సు మంటూ వుంటారో, వాళ్లనే మనస్సులో ఎంతైనా మెచ్చుకుంటూ వుంటారు. అది ఆయన నైజం. ఇక్కడ ఉన్నప్పుడు ఒక్కమారైనా మీదగ్గర కూర్చుని కష్టమూ సుఖమూ మాట్లాడారా; అలాంటిది, విశాఖపట్నంలో ఉన్నప్పుడు ఇరవైనాలుగు గంటలూ మిమ్మల్ని గురించే పలవరిస్తూ వుంటారు. చిన్నప్పటి నుంచీ పెంచి పెంచి పెద్దవాళ్ళని చేశారుట ఆయన్ని మీరు. వాళ్ల అమ్మ బాబూ ఎప్పుడైనా కొట్టబోయినా అడ్డువచ్చి తన వంటిమీద చెయ్యిపడకుండా మీరు కాచుకువచ్చేరుట. మిమ్మలిని వదిలి ఉండడం చాలా కష్టంగా ఉంటుందంటారు.

"ముసిలిముండని నన్ను తలుచుకునీ దాకా వాడికేం అవసరమమ్మా! అంత అభిమానం ఉన్న వాడు ఒక్కమారేనా కొత్తకాపరం చూద్దువు గాని రమ్మని మాటవరసకైనా అన్నాడా? పోనీ, ఏదో మీరు సుఖంగా వుంటే అంతే చాలు. మాకు అంతకంటే కావలసినదేముంది?"

"బామ్మగారూ, నేను ఒట్టువేసుకుని చెబుతున్నాను నమ్మండి. ఆయనకు అందరికంటే మీమీదనే అభిమానం ఎక్కువ. అయితే, ఆయనలో ఉన్న పెద్ద లోపమేమిటంటే ఆయనకు తన అభిమానాన్ని పైకి తెలియపర్చడం చేతగాదు. మిమ్మలిని, విశాఖపట్నం తీసుకువస్తానని నాతో యాభైమార్లయినా అన్నారు. అంటే, నేనే వెనక్కిలాగేదాన్ని, నిజం చెప్పాలిగా మరి,—ఎం చేతనంటే, మేమే అక్కడ నానా బాధలూ పడుతున్నాము. దానికి తోడు ఇంత పెద్దకాలంలో మీకుకూడా శ్రమకలిగించడం నాకు యిష్టంలేదు. మిమ్మల్ని తీసుకువెళ్ళి మీకు సేవచేయడం అంటే మాకు చాలా యిష్టం. అయితే, మీరు వచ్చేక ఊరికే కూర్చోరు. చేసివున్న చెయ్యి, వట్టినే కూర్చోమంటే కూర్చోరు. మిమ్మల్ని తీసుకువెళ్లి మీచేత పనిపాట్లు చేయించుకోవడం మాకు యిష్టంలేదు. అయితే, మిమ్మలిని తల్చుకోని రోజుండదనుకోండి.

"అయితే వొసే, మా కిష్టప్ప చిన్నప్పటిలాగా ఆకతాయి వ్యవహారంగానే ఉన్నాడా, ఏమైనా కొంచం ఊర్జితుడయేడా? చిన్నప్పుడు మహా పెంకితనం చేసే వాడులే."

"చిన్నప్పటి సంగతి నాకేం తెలుసును లెండి. కాకపోయినా చిన్నప్పుడు ఎవరుమాత్రం పెంకితనం చెయ్యరు చెప్పండి."

"అమ్మ గడుసుబుర్రా! అప్పుడే మొగుణ్ణి వెనకేసుకు రావడం నేర్చేవూ?"

"వెనకేసుకు రావడంకాదు బామ్మగారూ, ఉన్నమాట అన్నాను అంతే."

"అయితే యిప్పుడేం కిసిమిసి సెలవలా ఏమిటి, వచ్చేరు?"

"ఇప్పుడే సెలవలూ లేవు. సెలవుపెట్టి వచ్చేము."

"వట్టినేనా?"

"వట్టినే ఏమిటిలెండి. మిమ్మలినిచూసి చాలా రోజులైంది. ఒకసారి వెళ్ళి చూసివద్దామని రెండు నెల్లనుంచి ప్రయాణం చేస్తున్నారు. ఇక ఉండబట్టక, సెలవుపెట్టి నన్నుకూడా బయలుదేరించి తీసుకొచ్చేరు. మిమ్మలిని ఎలాగైనా విశాఖపట్నం తీసుకువెళ్లడాని కని వచ్చేరు తను. అదీ, అసలు సంగతి."

"అయితే నాతో ఆ ముక్కైనా అనలేదే వాడూ!"

"నేను చెప్పేను కాదూ మొట్టమొదటే, ఆయనకు మహా గొప్ప మొహమాటం. అడిగితే, పనిపాట్లు చేసిపెట్టడానికి రమ్మంటున్నారని, మీ రెక్కడనుకుంటారో అని భయం ఓమూల."

"అయితే నువ్వు వాడితరఫున వకాలత్తు పుచ్చుకున్నావా?"

"ఆయన అభిప్రాయం మీకు చెప్పేనండీ."

"అయితే అది ఆయన అభిప్రాయమే గాని నీ అభిప్రాయం కాదన్నమాట. అంతేనా?"

"ఎంతమాటన్నారు బామ్మగారూ! నాకీ ఉద్దేశం మొదటినుంచీ ఉందనుకోండి. ఎలాగైనా మీరు మీ మనమడిమాట వింటారు గాని నా మాట వింటారా?

## 4

బామ్మగారూ మీ రెండుకు మడి కట్టుకోడం, నేను స్నానంచేసి వంటచేసేస్తాను వేగం. మీరు రామా కృష్ణా అంటూ ఓచోట కూర్చోండి."

"లేని అలవాట్లు యిప్పుడు ఎక్కడినుంచి తెచ్చుకోమన్నావు. ఉట్టినే కూర్చోడం నాకు ఎప్పుడూ అలవాటు లేదమ్మా. ఏదో బతికివున్న నాలుగు రోజులూ యింత వుడకబెట్టి నా చేత్తో నలుగురికి యింత వడ్డించడం తప్పించి నేను చెయ్యగలిగింది అంతకంటె ఏముంది. కాక, నే కాదని కాళ్ళావేళ్ళాబడి బ్రతిమలాడితే, ఏదో, కాదనలేక వచ్చేను. రావడం కాళ్ళు జాచుకుని కూర్చుని మీచేత చాకిరీ చేయించుకోడానికా ?"

ఆఖరుకి మా ఆవిడను మడికట్టుకో నివ్వకుండా మా బామ్మే మడికట్టుకొని వంటచేసింది. నేను అంతకుముందు పాచిగుడ్డలతో నే భోజనంచేసే వాడిని కాని, యీదినం మా బామ్మ ఎదుట అందుకు సాహసించలేకపోయేను. మడీ, తడీ, ఆచారంలో నాకు నమ్మకము లేకపోయినా, మా బామ్మ వడ్డిస్తుంటే, కట్టుగుడ్డలతో కూర్చోడానికి ధైర్యం చాలింది కాదు. పెట్టెలోనున్న బరంపురం పట్టుపంచ తీసి కట్టుకొని భోజనానికి కూర్చున్నాడు.

"ఏమిరా బాబూ! పట్టుపంచ రోజూ కట్టి యీడిచేస్తే ఎందుకేనా పనికొస్తుందీ. బోలెడేసి ఖరీదులు పెట్టి కొనుక్కున్న బట్టగదా అవి రోజూ వాడేస్తే మూణ్ణాళ్ళకే ముక్కలయి వూరుకుంటాయి. ఏదో పండుగా పర్వమూ, పెళ్లీ పేరంటం విందులూ వియ్యాలూ వచ్చినప్పుడు కట్టుకోవలసిన బట్టల్ని యిలా నలిపేసుకుంటే ఎలాగరా! ఏదో రెండో మూడో యిచ్చి, రోజూ వాడకానికి పనికివచ్చిన పొత్తుపంచ ఒకటి కొనుక్కుని కాలక్షేపం చెయ్యాలి. ఉన్న వస్తువుల్ని పూర్జితం చేసుకుంటే కొత్తవి కొన్నంత ఫలం."

మా బామ్మ నోట్లోనుండి వెలువడిన మాట నాకు అమృతవర్షంగా అనిపించింది.

"నువ్వు చెప్పినట్టే చేస్తున్నాను బామ్మా! ఈ వాళ నువ్వు వచ్చేవుగదా అని సరదాకొద్దీ యిది తీసి కట్టుకున్నానుగాని రోజూ దీనిని వాడడం లేదు."

మా బామ్మ పప్పూ అన్నములో నెయ్యి వెయ్యడానికి నేతిగిన్నె తెచ్చి అందులోని గరిటె చూచి ఆశ్చర్యపడింది.

"ఇదేమిట్రా! ఇది గరిటా బ్రహ్మరాక్షసా!

ఎక్కడ సంపాదించేవురా నాయినా యీ గరిటె? పులుసు వేసుకునీ గరిటంత ఉందిగదా, దీనితో నా నెయ్యి వేసుకోడం? ఇలాగైతే సంసారం ఎంతకాలం సాగుతుంది. ఉన్నదాంట్లో ఉన్నంత మట్టుకు ఊర్జితం చేసుకొని గౌరవంగా కాలక్షేపం చేసుకోవాలి గాని, ఉన్నకాడికి రొంతా ఊడిచేసుకొని వీథిపడితే ఏం లాభం ?"

మా బామ్మ మమ్మలిని యిలాగు చీవాట్లు పెడుతూవుంటే, అవి నిజముగా నేను ఆశీర్వచనములుగా భావిస్తూ తలవంచుకుని కూర్చున్నాను.

"అంతకంటె చిన్న గరిటెకోసం ప్రయత్నం చేసేను కాని దొరకలేదు బామ్మా. అంచేత అందాకా యీ గరిటె వాడుతున్నాము.

"వోసి యిలారా, నేను తెచ్చిన మూటవిప్పి అందులో మిల్లిగరిటె వుంటుంది తీసి యిలాగ పట్టుకురా! నేను యింటిదగ్గిర అనుకున్నట్టె వుంది మీ కాపరం అచ్చంగా, గరిటె మూటలో పడేసుకుని రావడం మంచిదే అయింది."

నా చిన్నతనంలో నాడు ఏ మా బామ్మ ఏ మిల్లిగరిటెలో వడ్డించి నా కోపానికి పాత్రురాలైందో నేను ఆ, మా బామ్మయే ఆ మిల్లి గరిటెతోనే ఈ నెయ్యి వడ్డించి నా గౌరవానికి, నా భక్తికి, నా ఆదరాభిమానాలకీ పాత్రురాలైంది. దృక్పథం మారగానే దృశ్యాలు కూడా మారుతాయిగదా! తనవరకూ వస్తేనేగాని తత్వం బోధపడదు ఎవరికైనా. నెయ్యి వడ్డిస్తూ మా బామ్మ అన్నది. 'నాయనా! మీ సంసారాన్ని బాగుచేయగలిగింది యీ మిల్లిగరిటే, నేను బ్రతికి ఉన్నా, లేకపోయినా మీరుమాత్రం యీ మిల్లి గరిటెని భద్రంగా దాచుకుని మీ మనమలకీ మునిమనమలకీ అందజెయ్యండి.

---